అసమానతలు, దోపిడీ అంతమయ్యేవరకు సాయుధ తిరుగు బాట్లు జరుగుతూనే ఉంటాయి

నక్సలిజం భారతదేశాన్ని మార్చలేకపోయింది. అది నిజం. కానీ భారతదేశం ఎలా మారిందో.. నక్సలిజం మనకు చూపించింది. భూస్వామ్య అరాచకాలు, వెట్టిచాకిరి, అటవీ దోపిడీ ఈ అంశాలు ప్రజాస్వామ్య వ్యవస్థను సవరించడానికి నక్సలిజం ఒత్తిడి గ్రూప్‌లా పనిచేసింది. అయితే కులం, ప్రజాస్వామ్యం, మారుతున్న ఆకాంక్షలను అర్థం చేసుకోవడంలో ఆ ఉద్యమం విఫలమైంది. ఇప్పుడు మావోయిస్టు నాయకుల లొంగుబాట్లు ఒక విషయం స్పష్టం చేస్తున్నాయి. 'కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్'తో అనేక మంది మావోయిస్టులను తుడిచి పెట్టేస్తున్నారు." ? "మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రధాన కార్యదర్శి నంబాళ కేశవరావును, మావోయిస్టుల సాయుధ వ్యూహకర్త హిడ్మాను ఎన్‌కౌంటర్‌లో అంతమొందించారు. మల్లోజుల వేణుగోపాల్, ఆశన్న సహా వందలాది మంది లొంగిపోయారు."" చివరికి మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి తిప్పిరి తిరుపతి, అలియాస్ దేవ్ జీ, పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లా రాజిరెడ్డి తెలంగాణా పోలీసుల ముందు లొంగిపోతున్నారు. మోడీ ప్రభుత్వం మావోయిస్టులను పూర్తిగా తుడిచి పెట్టేస్తోంది." అన్నది తాజాగా వెలువడిన వార్త. ఇలాంటి వార్తలను, వారు ఉపయోగించిన భాషను గమనిస్తే, నిజమేనని నమ్మే అవకాశమే ఎక్కువ. కానీ ఇందులో కొన్ని సత్యాలతోపాటు అసత్యాలు, అర్ధసత్యాలు కూడా ఉన్నాయి. కాంగ్రెస్ పాలనలోనే 'ఎన్ కౌంటర్'లు మొదలైనప్పటికీ, బీజేపీ పాలనలో అవి తారాస్థాయికి అందుకున్నాయి. మావోయిస్టులను ప్రత్యక్షంగా చంపివేయడానికి కేంద్ర ప్రభుత్వమే రంగంలోకి దిగింది. ఆపరేషన్ గ్రీన్ హంట్, ఆపరేషన్ సమాధాన్, ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్ వంటి పేర్లతో మావోయిస్టుల ఏరి వేత మొదలుపెట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వంతో పోల్చుకుంటే, పన్నెండేళ్ళ క్రితం కేంద్రంలో అధికారంలోకొచ్చిన హిందుత్వ వాద బిజేపి ప్రభుత్వం నేటి మావోయిస్టు పార్టీ పట్ల చాలా కఠినంగా వ్యవహరిస్తోంది. ఏడాది క్రితం 'కగార్' ఆపరేషన్‌ను ప్రారంభించిన కేంద్రం, ఈ ఏడాది మార్చి 31 కల్లా మావోయిస్టు రహిత భారత దేశాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. తమకు జీవనాధారమైన భూమిని నిలబెట్టుకోవడం ప్రజలకు జీవన్మరణ పోరాటమైనప్పుడు, వారి ఆందోళనలు తిరుగుబాట్లు అనివార్యమై, అవి సాయుధ రూపాన్ని సంతరించుకుంటాయి. భూమి కోసం, భుక్తికోసం ఉద్భవించిన తెలంగాణా సాయుధపోరాటం నిజాం పాలనను అంతమొం దించింది. ప్రజలు కోరిన భూమి సమస్యను పరిష్కరించకుండా, నిజాంను రాజ్ ప్రముఖ్‌గా చేసి, అతని ఆధ్వర్యంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం వేల సంఖ్యలో కమ్యూనిస్టులను చంపేసింది. భూమి సమస్య వల్లనే 1967లో నక్సల్ బరీ ఉద్యమం తలెత్తింది. సాయుధ పోరాట మార్గంతో 1969లో ఏర్పడిన సిపిఐ(ఎంఎల్) ఆధ్వర్యంలో శ్రీకాకుళ రైతాంగ ఉద్యమంగా ఊపందుకుంది. ఈ ఉద్యమంలో పాల్గొన్న విప్లవకారులను ప్రభుత్వం ఎన్‌కౌంటర్ల పేరుతో చంపేయడం మొదలు పెట్టింది. అదే సమయంలో తెలంగాణా ప్రాంతంలో కూడా లెక్కలేనన్ని 'ఎన్‌కౌంటర్లు' జరిగాయి. కాంగ్రెస్ ప్రభుత్వం దేశ వ్యాప్తంగా చేపట్టిన భూసంస్కరణలు, ప్రజల మౌలికమైన భూమి సమస్యను పరిష్కరించలేకపోయింది. అత్యధిక ప్రజల జీవనాధారం భూమి కావడంతో, భూమి కోసం అనేక మంది యువకులు ప్రాణాలను లెక్కచేయకుండా సాయుధ పోరాట పంథాను అనుసరించారు.సిపిఐ(ఎంఎల్) పీపుల్స్ వార్ 1980లో ఏర్పడి, ప్రజలకు సాయుధ మద్దతుగా నిలబడింది. తెలంగాణా గ్రామాల్లో 'నీ బాంచెన్ దొర' ' నీ కాల్మొక్త దొర' అనే స్థాయి నుంచి, భూస్వాములకు వ్యతిరేకంగా ఎదురొడ్డేలా ప్రజలకు ధైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని కలిగించగలిగింది. ఎన్ని ఎన్‌కౌంటర్లు జరిగినా, ఎంత మంది యువకులను, నాయకులను పోగొట్టుకున్నా, పోలీ

సులు, ప్రభుత్వాధికారులు, పెత్తందార్ల దౌర్జన్యాలను పీపుల్స్ వార్ చాలా మటుకు నిలువరించ గలిగింది. పీపుల్స్ వార్ దెబ్బకు కొందరు భూస్వాములు గ్రామాలను వదిలిపెట్టి నగరాలకు, పట్టణాలకు వలస వెళ్ళారంటే, ఆ ఉద్యమం ఎంత బలంగా పాదుకుందో వేరే చెప్పనవసరం లేదు. ఈ నేపథ్యంలో, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 2004లో పీపుల్స్ వార్‌తో చర్చలు కూడా జరిపింది. ఆ చర్చల చివరి రోజునే పీపుల్స్ వార్ కాస్తా మావోయిస్టు పార్టీగా ఆవిర్భవించింది. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి పెద్ద ఎత్తున భూములను కార్పొరేట్ శక్తులకు బదలాయించడం మొదలైంది. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్‌లో విలువైన ఖనిజాలకోసం ఆదివాసీలను వారి భూముల నుంచి తరిమేయడానికి కేంద్రం చేపట్టిన చర్యలను మావోయిస్టులు ఆదివాసీలతో కలిసి ప్రతిఘటించడం మొదలుపెట్టారు. మావోయిస్టులను అంతం చేయందే కార్పొరేట్ శక్తులకు భూముల బదలాయింపు సాధ్య కాదన్న నిర్ణయానికి కేంద్ర ప్రభు త్వం వచ్చేసింది. దీంతో మావోయిస్టులకు, కేంద్ర బలగాలకు ప్రత్యక్ష యుద్ధం మొదలైంది. ఫలితంగా కేంద్రం మావోయిస్టులపై 'ఆపరేషన్ కగార్' యుద్ధం ప్రకటించింది. ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు(బస్వరాజు), చలపతి, గాజర్ల గణేశ్, రామచంద్రారెడ్డి వంటి అగ్ర నాయకులను ఎన్ కౌంటర్ పేరుతో చంపేశారు. ఆదివాసీ అయిన హిడ్మా వంటి మిలటరీ వ్యూహకర్తను పట్టుకుని ఎన్‌కౌంటర్ పేరుతో చంపేశారు. హిడ్మాతో దొరికిన మరో 60మందిని అరెస్టు చూపించారు. మల్లోజుల వేణుగోపాల్, ఆశన్న వంటి వారి ఆధ్వర్యంలో వందలాది మంది ఆయుధా లతో లొంగిపోయారు.కేంద్రంలో బీజేపీ అధికారంలోకొచ్చినప్పటి నుంచి మావోయిస్టు ఉద్యమం బాగా దెబ్బతింది. ఒక్క ఏడాదిలోనే 300 మందిని ఎన్‌కౌంటర్ల పేరుతో చంపేశారు. వేల సంఖ్యలో లొంగుబాట్లు జరుగుతున్నాయి. అగ్రనాయకత్వం కూడా లొంగిపోతోంది. తిండి తీర్థం దొరికినా దొరకకపోయినా, కనీస సదుపాయాలకు నోచుకోకుండా, ప్రాణాలను సైతం లెక్కచే యకుండా, నాలుగైదు దశాబ్దాలపాటు అడవుల్లో సాయుధంగా పోరాడిన నాయకులు, కేవలం ప్రాణాలను నిలబెట్టుకోవడం కోసం లొంగిపోతున్నారంటే నమ్మగలమా! ప్రస్తుత పరిస్థితిలో సాయుధ పోరాటం సాధ్యంకాదని, లీగల్ పద్ధతిలో పనిచేయడానికి లొంగిపోతున్నారా! భవిష్యత్తు వ్యూహంతో లొంగిపోతున్నారా! హర్రీడ్ జస్ట్ స్ఈజ్ బర్రీడ్ జస్టిస్ (తొందరపడి చెప్పే తీర్పు న్యాయానికి సమాధి). ఈ దేశంలో భూమి సమస్య పరిష్కారం కానంత వరకు, అసమాన తలు, దో పిడీ అంతమయ్యేవరకుసాయుధ తిరుగుబాట్లుజరుగుతూనే ఉంటాయన్నదిచరిత్రచెప్పే పాఠం.

ధర్మపురి భవిష్యత్తుకు బలమైన పునాది..సంకల్ప సభగా మారిన పాలకవర్గ పదవీ స్వీకారం

విశ్వంభర, ధర్మపురి:

జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలో మున్సిపల్ ఎన్నికల అనంతరం కొత్త పాలకవర్గం పదవీ బాధ్యతలు స్వీకరించిన కార్యక్రమం ప్రజాస్వామ్య స్ఫూర్తిని ప్రతిబింబించిన ఘట్టంగా నిలిచింది. ఇది కేవలం అధికార బదిలీ కార్యక్రమం మాత్రమే కాదు; ప్రజల తీర్పుకు రాజకీయ, పరిపాలనా ప్రతిస్పందనగా రూపుదిద్దుకున్న ఆత్మీయ సభ. ఎన్నికల ద్వారా వ్యక్తమైన ప్రజాభిప్రాయం అధికార రూపం దాల్చిన క్షణం ఎల్లప్పుడూ చారిత్రకమే. అలాంటి చారిత్రక వాతావరణంలో ధర్మపురి పట్టణ ప్రజలు కొత్త ఆశలతో, కొత్త ఆశయాలతో కొత్త పాలక వర్గాన్ని ఆహ్వానించారు. పట్టణ ప్రజల ఆకాంక్షలు, రాజకీయ నాయకత్వ సంకల్పం, పరిపాలనా యంత్రాంగం సమన్వయం---కలిసి ఒక సరికొత్త ఆరంభానికి నాంది పలికాయి. సభ ప్రాంగణం నిండా కనిపించిన ఉత్సాహం, ప్రజల స్పందన, నాయకత్వపు హామీలు---కలిసి ధర్మపురి భవిష్యత్తుపై నూతన ఆశావాదాన్ని నిర్మించాయి. చైర్‌పర్సన్‌గా వేముల నాగలక్ష్మి, వైస్ చైర్మన్‌గా రామయ్య, 15 వార్డుల్లో విజయం సాధించిన కౌన్సిలర్లు బాధ్యతలు స్వీకరించగా సభలో హర్షధ్వానాలు మార్మోగాయి. ఇది వ్యక్తుల గెలుపు మాత్రమే కాదు; ప్రజల విశ్వాసానికి ప్రతీక. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల ఫలితాలు ఒక దశ మాత్రమే; వాటి అనంతరం జరిగే బాధ్యతల స్వీకరణ కార్యక్రమం ప్రజా నిబద్ధతకు ప్రమాణం. ఈ వేదికపై అధికార యంత్రాంగం, రాజకీయ నాయకత్వం, ప్రజా ప్రతినిధులు ఒకే దిశగా అభివృద్ధి సంకల్పాన్ని వ్యక్తం చేయడం ప్రత్యేకత. సంక్షేమ శాఖల మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై నూతన పాలకవర్గాన్ని అభినందించడం ఈ కార్యక్రమానికి మరింత ప్రాధాన్యం తీసుకొచ్చింది. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి అదనపు కలెక్టర్ రాజాగౌడ్, తహసీల్దార్ శ్రీనివాస్, మార్కెట్ చైర్‌పర్సన్ లావణ్య, దేవస్థానం చైర్మన్ జక్కు రవీందర్ తదితరులు హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. పరిపాలన, రాజకీయాలు, సామాజిక రంగ ప్రతినిధులు ఒకే వేదికపై చేరడం సమగ్ర పాలనకు సంకేతంగా భావించవచ్చు.మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రసంగం ఈ సభకు భావోద్వేగ గాఢతను, రాజకీయ స్పష్టతను అందించింది. 2023లో ఎమ్మెల్యేగా ఎన్నికై అనంతరం మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తాను ధర్మపురి ప్రజల ఆశీస్సులతోనే ఈ స్థాయికి చేరుకున్నానని గుర్తుచేసుకుంటూ ఆయన కృతజ్ఞతాభావం వ్యక్తం చేశారు. ప్రజల ఆశీర్వాదం లేకుండా రాజకీయ ప్రయాణం సాధ్యం కాదని, ఆ ఆశీర్వాదానికి ప్రతిఫలం అభివృద్ధి రూపంలో ఇవ్వాలనే సంకల్పం తనదని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో 15 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ సాధించిన విజయం ప్రజల విశ్వాసానికి నిదర్శనమని వ్యాఖ్యానిస్తూ, ఇది సంఖ్యల గెలుపు మాత్రమే కాదని, అభివృద్ధి--సంక్షేమ దిశగా ప్రజలు ఇచ్చిన ఆమోదముద్ర అని స్పష్టం చేశారు. "ఒకే పార్టీ, ఒకే జెండాను నమ్ముకున్న ప్రజల అభిమానం మరువలేనిది; ప్రజలకు మేలు చేయడంలో ఎలాంటి రాజీ ఉండదు" అనే ఆయన వ్యాఖ్య సభలో విశేష స్పందనను రేకెత్తించింది. ఎన్నికల హామీల అమలే ప్రజల రుణం తీర్చుకునే మార్గమని, పాలనలో పారదర్శకత, నిబద్ధత ప్రధానంగా ఉంటాయని హామీ ఇచ్చారు.ధర్మపురి మున్సిపాలిటీలో ప్రస్తుతం సుమారు ముప్పై కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని మంత్రి వివరించారు. పట్టణ మౌలిక వసతుల అభివృద్ధి దిశగా రహదారుల విస్తరణ, కాలువల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ పునర్నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటు, పారిశుద్ధ్య సదుపాయాల విస్తరణ వంటి కీలక పనులు చేపట్టినట్లు తెలిపారు. పట్టణ జీవన ప్రమాణాలు మెరుగు పడాలంటే మౌలిక వసతులు బలోపేతం కావాలని ఆయన స్పష్టం చేశారు. పనుల నాణ్యతపై ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని కమిషనర్, అదనపు కలెక్టర్‌కు సూచించారు. సమయ పాలనతో పనులు పూర్తి చేసి ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా చూడాలని ఆదేశించారు. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో త్రాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, బోర్లు, పైపులైన్ల మరమ్మతులు, నీటి నిల్వ ట్యాంకుల శుద్ధి వంటి అంశాలను అత్యవసరంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ప్రజా అవసరాలపై ముందస్తు ప్రణాళికతో స్పందించే పాలననే సమర్థ పాలనగా ఆయన అభివర్ణించారు.పుష్కరాలు సమీపిస్తున్న నేపథ్యంలో ధర్మపురి ప్రాధాన్యం మరింత పెరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరం అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఘాట్ల

నిర్మాణం, పాత ఘాట్ల మరమ్మతులు, యాత్రికుల కోసం తాత్కాలిక వసతి గృహాలు, పారిశుద్ధ్య సదుపా యాలు, త్రాగునీటి ట్యాంకర్లు, ట్రాఫిక్ నియంత్రణ, రహదారి విస్తరణ వంటి అంశాలపై సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సూచించారు. లక్షలాది మంది భక్తులు తరలి వచ్చే అవకాశమున్న నేపథ్యంలో వైద్య శిబిరాలు, అత్యవసర సేవలు, భద్రతా ఏర్పాట్లు పటిష్ఠంగా ఉండాలని స్పష్టం చేశారు. పుష్కరాలను కేవలం ఆధ్యాత్మిక వేడుకగా కాకుండా పట్టణాభివృద్ధికి అవకాశంగా మలుచు కోవాలని ఆయన అభిప్రాయ పడ్డారు.ధర్మపురి క్షేత్రంపై తనకు ఉన్న ఆధ్యాత్మిక అనుబంధాన్ని మంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ క్షేత్రం తనకు ఆత్మీయత కలిగించిన ప్రదేశమని, భవిష్యత్తులో ఇక్కడే నివసిస్తూ సేవ చేయాలనే సంకల్పం ఉన్నదని ప్రకటించారు. రాజకీయ నాయకత్వం ప్రాంతీయ అనుబంధంతో ముడిపడి ఉంటేనే ప్రజల విశ్వాసం బలపడుతుందని ఆయన వ్యాఖ్యలు సూచించాయి.అదనపు కలెక్టర్ రాజాగౌడ్ తన ప్రసంగంలో స్థానిక సంస్థల ఆర్థిక స్వావలం బనపై దృష్టి సారించారు. పట్టణ ప్రగతికి దీర్ఘకాలిక ప్రణాళిక అవసరమని, ఆదాయ వనరుల పెంపు లేకుండా అభివృద్ధి సాధ్యం కాదని పేర్కొన్నారు. పన్నుల సక్రమ వసూలు, వ్యయ నియంత్రణ, ప్రజా భాగస్వామ్యంతో ప్రణాళికల రూపకల్పన వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకోవాలని సూచించారు. స్థానిక సంస్థల బలం వారి ఆర్థిక సామర్థ్యంలోనే ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా రానున్న పుష్కరాల దృష్ట్యా పట్టణంలో చేపట్టాల్సిన మౌలిక సదుపాయాల పనులపై సమీక్ష నిర్వహించి, అవసరమైన నిధుల కోసం సమగ్ర నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని అధికారులకు సూచించారు.చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి తన ప్రసంగంలో ప్రజల ఆశయాలే తమ పాలనకు దిశానిర్దేశమని పేర్కొన్నారు. ఎన్నికల హామీల అమలు, వార్డుల సమస్యల పరిష్కారం, పారదర్శకత, సమయపాలన---ఇవే తమ పాలనా మూల సూత్రాలని స్పష్టం చేశారు. వైస్ చైర్మన్ రామయ్య సమగ్ర అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని, అన్ని వర్గాల ప్రజలతో సమన్వయం సాధిస్తామని తెలిపారు. ధర్మపురి మున్సిపల్ పాలకవర్గం బాధ్యతల స్వీకరణ కార్యక్రమం పరిపాలనా మార్పు కంటే ఎక్కువగా అభివృద్ధి సంకల్పానికి ప్రతీకగా నిలిచింది. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం, నిధుల సమీకరణ, ప్రణాళికాబద్ధ అభివృద్ధి, పుష్కరాల విజయవంత నిర్వహణ వంటి సవాళ్లు ముందున్నాయి. అయితే సభలో వ్యక్తమైన సంకల్పం, పరస్పర సహకారం, రాజకీయ--పరిపాలనా ఏకాభిప్రాయం ధర్మపురి పట్టణాన్ని అభివృద్ధి--సంక్షేమ దిశగా నడిపించే బలమైన పునాది వేసినట్లు స్పష్టమవుతోంది. ప్రజాస్వామ్య పునాదులపై నిలిచిన ఈ కొత్త ఆరంభం ధర్మపురి భవిష్యత్తును మరింత ప్రకాశవంతం చేయాలనే ఆశాభావాన్ని ప్రజల్లో నింపింది. ప్రజల తీర్పు, నాయకత్వ సంకల్పం, పరిపాలనా సమన్వయం సమగ్రమైతే స్థానిక స్వపరిపాలన సంస్థలు ప్రాంతీయ అభివృద్ధికి ఎంతగానో దోహదపడగలవని ఈ సందర్భం స్పష్టంగా చాటిచెప్పింది.

కొల్లూరు సర్వీస్ రోడ్డుని త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తెస్తాం : మెదక్ ఎంపీ

విశ్వంభర, రామచంద్రాపురం : రామచంద్రాపురం మండలం కొల్లూరు ఎగ్జిట్ నెంబర్ 2 వద్ద నిర్మాణంలో ఉన్న సర్వీస్ రోడ్డు ని త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తెస్తామని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం సర్వీస్ రోడ్డు నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. రవాణా సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ సర్వీస్ రోడ్డు పనులు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. గతంలోనే ఈ సర్వీస్ రోడ్ నిర్మాణం గురించి ప్రభుత్వం పై స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. స్థానిక జిల్లా మంత్రులు ఎమ్మెల్యే లకు కూతవేటు దూరంలో ఉన్న సర్వీస్ రోడ్ సమస్య ఎందుకు కనిపించట్లేదని ప్రశ్నించారు. ముఖ్యంగా ఈ రూట్ లో ప్రయాణించే స్థానిక ప్రజలతో పాటు ఐటీ ఉద్యోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.క్షేత్ర స్థాయిలో ట్రాఫిక్ ఇబ్బందులను స్వయంగా పరిశీలించిన ఆయన రోడ్డు పనులు పూర్తయ్యాక కొల్లూరు పరిసర ప్రాంతాలకు రాకపోకలు సులభతరం అవుతాయని, అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖ ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు, స్థానిక ప్రజాప్రతినిధులతో మాట్లాడి పనుల పురోగతిపై సమీక్షించారు. ప్రజల సౌకర్యమే ప్రధాన లక్ష్యమని, అభివృద్ధి పనుల్లో రాజీ పడబోమని ఆయన పేర్కొన్నారు.

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై విచారణ వాయిదా

విశ్వంభర, తెలంగాణ బ్యూరో:

కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై బుధవారం తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ఈ నివేదికను రద్దు చేయాలంటూ గతంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు, ఐఏఎస్ ఆఫీసర్ స్మితా సబర్వాల్, మాజీ సీఎస్ ఎస్?కే జోషి పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై ఇవాళ విచారణ జరిగింది. విచారణ సందర్భంగా హరీశ్‌రావు తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది సుందరం వాదనలు వినిపించారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ పరిధి దాటి వ్యవహరించిందని, కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్ చట్టం ప్రకారం పీసీ ఘోష్ నివేదిక చెల్లదన్నారు. మేడిగడ్డ పిల్లర్ కుంగిపోతే ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేసింది. ఏం జరిగిందో నివేదిక ఇవ్వాల్సిన బాధ్యత మాత్రమే కమిషన్‌పై ఉంటుందని వాదించారు. కమిషన్ తన పరిధి దాటి నివేదిక ఇచ్చిందని అందువల్ల జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక చెల్లదని వాదించారు. సుందరం వాదనలు విన్న అనంతరం తదుపరి విచారణను హైకోర్టు ఎల్లుండికి వాయిదా వేసింది. ఎల్లుండి కేసీఆర్ తరఫున న్యాయవాది శేషాద్రి నాయుడు వాదనలు వినిపించనున్నారు.

పాఠశాలల్లోనే విద్యార్థుల ఆధార్ నమోదు.. బయోమెట్రిక్ అప్‌డేషన్

విశ్వంభర, తెలంగాణ బ్యూరో: రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులందరికీ వందశాతం ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల సమయంలో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోకుండా ఈ ప్రత్యేక డ్రైవ్‌ను చేపట్టింది. బుధవారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులు ఆధార్ కేంద్రాల చుట్టూ తిరిగే పనిలేకుండా, పాఠశాల ప్రాంగణాల్లోనే ఆధార్ కిట్‌లను ఏర్పాటు చేసి నమోదు ప్రక్రియను పూర్తి చేస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా మూడు ఆధార్ మ్యాన్‌పవర్ ఏజెన్సీలను ప్రభుత్వం నియమించింది. ఒక్కో ఏజెన్సీకి 11 జిల్లాల బాధ్యతలను అప్పగించారు. ఇప్పటివరకు ఆధార్ లేని విద్యార్థులు లేదా బయోమెట్రిక్ అప్‌డేట్ పెండింగ్‌లో ఉన్న వారి వివరాలను యూడీఐఎస్ఈ పోర్టల్ ద్వారా గుర్తించి, ప్రాధాన్యత క్రమంలో నమోదు చేయాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. తమ పిల్లల ఆధార్ వివరాలు పెండింగ్‌లో ఉంటే వెంటనే పాఠశాల అధికారులను సంప్రదించాలని డైరెక్టర్ సూచించారు. నీట్, జేఈఈ వంటి జాతీయ పరీక్షలకు హాజరయ్యే సమయంలో ఆధార్ బయోమెట్రిక్ వివరాలు సరిగ్గా లేకపోతే విద్యార్థులు వెరిఫికేషన్ ప్రక్రియలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని, ముందుగానే పాఠశాల స్థాయిలోనే ఈ ప్రక్రియను పూర్తి చేయాలని విద్యాశాఖ నిర్ణయించింది.

బ్రెజిల్ లిథియం మైనింగ్ లో భాగస్వామ్యానికి సింగరేణికి ఆహ్వానం

విశ్వంభర, తెలంగాణ బ్యూరో :

తాము చేపట్టిన లిథియం మైనింగ్ లో సింగరేణి సంస్థ భాగస్వామిగా చేరాలని కోరుతూ బ్రెజిల్ దేశానికి చెందిన ప్రముఖ సీబీఎల్?సంస్థ ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం సింగరేణి ఛైర్మన్ , ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతిని కలిసి వివరాలను తెలిపింది. సీబీఎల్ ?(కంపాన్హియా బ్రసిలీరా డి లిటియో) బోర్డు డైరెక్టర్ డేనియల్ లెమే, సీఈవో వినీసియస్ అల్వారెంగా తమ కంపెనీ ఏవిధమైన పనులు చేపడుతుందని తెలిపారు. బ్రెజిల్ దేశంలో ఇప్పటికే తాము లిథియం మైనింగ్ చేపట్టామని, సింగరేణి సంస్థ కీలక ఖనిజాల పట్ల ఆసక్తితో ఉన్న నేపథ్యంలో తమ కంపెనీలో భాగస్వామిగా చేరినట్లయితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని వారు వివరించారు. తాము సింగరేణితో పాటు దేశంలోని ప్రముఖ కంపెనీలను కూడా సంప్రదిస్తున్నామని పేర్కొన్నారు. బుధవారం ప్రపంచంలో లిథియం కీలక ఖనిజానికి ఉన్న ప్రాధాన్యత, వ్యాపార కోణంలో ఉన్న లాభదాయకత గురించి వివరించారు. సింగరేణి సంస్థకు సంబంధించిన వివరాలను డైరెక్టర్ ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్ కె. వెంకటేశ్వర్లు, డైరెక్టర్ పర్సనల్, ఫైనాన్స్ గౌతమ్ పోట్రు చెప్పారు. బ్రెజిల్ దేశంలో కీలక ఖనిజ అవకాశాలను, లాభదాయకత తదితర అంశాలను తాము చర్చించి నిర్ణయం తీసుకుంటామని సింగరేణి ఉన్నతాధికారులు పేర్కొన్నారు.

జనగామ 'శక్తి డెయిరీ'లో ఘోర ప్రమాదం.. ఓవెన్ పేలి నలుగురికి తీవ్ర గాయాలు

విశ్వంభర, జనగామ:

జనగామ జిల్లాలోని శక్తి డెయిరీ లో భారీ పేలుడు సంభవించింది. బాదాం మిల్క్ ప్రాసెసింగ్ యూనిట్ వద్ద ఓవెన్ ఒక్కసారిగా పేలిపోవడంతో నలుగురు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. అందులో ముగ్గురి పరిస్థితి అత్యంత విషమంగా ఉన్నట్లుగా తెలుస్తోంది. అయితే, బాదాం మిల్క్ బాటిళ్లను వేడి చేసే ఓవెన్ పూర్తిగా చల్లారకముందే కార్మికులు దానిని తెరవడంతో ఈ ప్రమాదం జరిగినట్లుగా సమాచారం. లోపల హెవీ ప్రెషర్ ఉండటంతో ఓవెన్ ఒక్కసారిగా బ్లాస్ట్ అయ్యింది. పేలుడు ధాటికి అక్కడే ఉన్న వందలాది బాదాం మిల్క్ సీసాలు ముక్కలయ్యాయి. ఆ గాజు ముక్కలు వేగంగా వచ్చి కార్మికులకు గుచ్చుకోవడంతో వారికి తీవ్ర రక్తస్రావమైంది. ఈ మేరకు గాయపడిన వారిని వెంటనే స్థానిక ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్న ముగ్గురు కార్మికులను మెరుగైన చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తరలిస్తున్నట్లుగా తెలుస్తోంది. డెయిరీలో భద్రతా నిబంధనల పాటించకపోవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఈఎన్సీ అడ్మిన్‌గా శ్రీనివాస్.. ఉత్తర్వులు జారీ చేసిన నీటి పారుదల శాఖ

విశ్వంభర, తెలంగాణ బ్యూరో:

సాగునీటి రంగంలో కీలకమైన ఇంజినీర్ ఇన్ చీఫ్ (అడ్మిన్)గా శ్రీనివాస్ నియమితులయ్యారు. ఆయనకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కామారెడ్డిలో ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా పనిచేస్తున్న తమటం శ్రీనివాస్‌కు ఈఎన్సీ (అడ్మిన్)గా అదనపు బాధ్యతలు అప్పగించారు. కాగా, ఇప్పటి వరకు ఈఎన్సీ అడ్మిన్‌గా ఉన్న రమేశ్‌ను ఇటీవలే ఈఎన్సీ జన